# నవభూమి

## తెలంగాణ అనుబంధం

2 జూన్,2025 సోమవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in








# ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించే దిశగా సర్కార్

- మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమాలోచన
- ఉద్యోగుల సమస్యలు, డీఏలపై కీలక చర్చ
- రిటైర్మెంట్ వయసు ఏడాది పెంపుపై పరిశీలన
- మరింత పకడ్బందీగా రైతుభరోసా అమలు
- సంక్షేమం క్షేత్రస్థాయికి వెళ్లేలా విస్తృత ప్రచారం
- 5న క్యాబినెట్ భేటీ.. అన్నింటిపైనా నిర్ణయం



హైదరాబాద్-నవభూమిబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు లేవనెత్తిన పలు డిమాండ్లను పరిష్కరించే దిశగా రేవంత్ సర్కారు యోచిస్తోంది. వారి డిమాండ్లపై ఈ నెల 5న జరిగే మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు, పదవీ విరమణ వయసు పెంపు, సాధారణ బదిలీల అంశాల్లో క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. ఆదివారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రులతో సమావేశమై ఈ మేరకు చర్చించారు. దీంతోపాటు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సదస్సులు, వానాకాలం పంటల సాగు సన్నద్ధత, రాజీవ్ యువ వికాసం అంశాలపై మంత్రులు అందించిన నివేదికపై చర్చించారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన కమిటీకి సంబంధించి అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఇప్పటికే నివేదిక అందించారు. ఆ నివేదికలోని అంశాలతోపాటు ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులతో భేటీ సందర్భంగా వారు ప్రస్తావించిన డిమాండ్లనూ భట్టివిక్రమార్క.. సీఎంకు, మంత్రులకు వివరించారు. దీనిపై ఈ నెల 5న జరిగే క్యాబినెట్ భేటీలో చర్చించాలని, సమస్యల పరిష్కారంపై ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగుల అన్ని డిమాండ్లపై ఒక రోడ్‌మ్యాపను సిద్ధం చేయాలని సర్కారు భావిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయంలో ప్రభుత్వం రెండు రకాల ఆలోచనలతో ఉన్నట్టు సమాచారం.

ఇప్పటికే సర్కారుపై ఆర్థికభారం ఉండడం, దీనికితోడు ఈ ఒక్క ఏడాదే 8వేల మందికి పైగా ఉద్యోగులు రిటైర్ కానుండడంతో.. మరింత భారం పడకుండా ఉద్యోగుల పదవీ విరమణ వయసును ఏడాదిపాటు పెంచితే మంచిదని కొందరు మంత్రులు సూచించినట్లు తెలిసింది. దీంతో పాటు ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టడం ప్రభుత్వం మొదటి ఆలోచనగా ఉంది. ఇక రెండోది.. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల డీఏల్లో ఎన్నింటిని ప్రకటించాలనే దానిపై మంత్రివర్గ సమావేశంలో కచ్చితమైన నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోవాలనే అంశంపై చర్చించారు. కాగా, సమావేశంలో అన్ని అంశాలపై మాట్లాడుతున్న సమయంలో ప్రభుత్వ పనితీరు, క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పట్ల ఉన్న అభిప్రాయాలను కొందరు మంత్రులు ప్రస్తావించినట్లు తెలిసింది. రైతుభరోసా పథకం గ్రామాల్లో లక్షల మందికి అమలవుతోందని, అయితే దీనిని మరింత పకడ్బందీగా అమలు చేస్తే రైతుల్లో ప్రభుత్వం పట్ల మరింత సానుకూల స్పందన వస్తుందని వారు అభిప్రాయపడినట్లు సమాచారం. కాగా, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోవాలనే అంశంపైనా సమావేశంలో చర్చించారు. గ్రామ గ్రామానికి ఈ పథకాలను తెలిపేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

**5న మంత్రివర్గ సమావేశం..**

5న మంత్రివర్గ సమావేశం నిర్వహించి కీలక అంశాలపై చర్చించాలని మంత్రుల భేటీలో నిర్ణయించారు. గత నెల జిల్లాల్లో పర్యటించిన మంత్రులు.. అధికారులతో నిర్వహించిన సమీక్షలకు సంబంధించి తయారుచేసిన నివేదికలపై ఈ సమావేశంలో చర్చించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, అనర్హులకు లబ్ధి చేకూరకుండా చూడాలంటూ ఫిర్యాదులూ వచ్చాయని మంత్రులు.. సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పెద్దసంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి పరిశీలన తరువాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు. మరింత లోతుగా విశ్లేషించి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇక యాసంగిలో పండిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్థంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఇతర మంత్రులు అభినందించారు. రాబోయే వానాకాలం నేపథ్యంలో వ్యవసాయం, నీటిపారుదల ప్రాజెక్టులు, తాగునీటి అవసరాలపైనా చర్చించారు. ప్రధానంగా హైదరాబాద్ నగర ట్రాఫిక్, వర్షాల సమయంలో ప్రబలే వ్యాధుల అంశాలనూ ప్రస్తావించారు. వీటన్నింటిపై రోడ్‌మ్యాప్ రూపొందించాలని నిర్ణయించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 'తెలంగాణ రైజింగ్-2047'ను సాధించే దిశగా ముందుకెళ్లాలని, అందుకోసం దానిని ప్రజా ఉద్యమంగా మార్చాలని సమావేశంలో నిర్ణయించినట్టు సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

కాళేశ్వరం, దానిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అ?థారిటీ (ఎన్‌డీఎసఏ) ఇచ్చిన రిపోర్టుపై సీఎం, మంత్రుల సమావేశంలో చర్చించారు. ఈ నెల 5న జరగనున్న క్యాబినెట్ భేటీలో ఎన్‌డీఎసఏ నివేదికను ఆమోదించాలని నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. నిర్మాణ సంస్థపై చర్యలకు సిఫారసు చేయాలనే అంశంపైనా చర్చ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో.. ఆ అంశంపైనా చర్చించారు. ఇక బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ తరఫున నిరసన గళం బలంగా వినిపించాలని కూడా నిర్ణయించినట్టు తెలిసింది. ఏపీ, తెలంగాణ నీటి కేటాయింపుల విషయంలో రాజీ పడాల్సిన అవసరం లేదని, రాష్ట్ర రాజకీయాల్లో ఇది చాలా సున్నితమైన అంశమని అభిప్రాయపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కూడా సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు ఈ నెల 5న విచారణకు హాజరు కానున్న నేపథ్యంలో.. ఆ తరువాత జరిగే పరిణామాలపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఇటీవల ఎమ్మెల్యేలు, మంత్రులతో పాటు ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు తీసుకుంటున్న క్రమంలో ఆ అంశంపైనా చర్చించారు. అనంతరం బీఆర్ఎసలో పరిణామాలు, కవిత కొత్త కార్యాలయం ప్రారంభంపై మాట్లాడుకున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేననే అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వెళ్లిందని అభిప్రాయపడ్డట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని మరికొందరు మంత్రులు అన్నట్లు సమాచారం.

సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను కలిసి ఆయనతో ముచ్చటించారు.

# నేటి నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం

- నేటి నుంచి.. స్లాట్ బుకింగ్‌తోనే రిజిస్ట్రేషన్లు
- అన్ని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో.. రోజుకు 48 స్లాట్లు
- అత్యవసర సందర్భాల్లో 5 వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి
- రిజిస్ట్రేషన్ సేవల్లో వాట్సాప్ చాట్‌బాట్
- 82476 23578కు వాట్సాప్,ఏఐతో సందేహాల నివృత్తి
- రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతానికి ఆధార్
- అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష



హైదరాబాద్-నవభూమిబ్యూరో

రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి రానుంది. అలాగే, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రజల కు వచ్చే సందేహాల నివృత్తికి కృత్రిమ మేధ(ఏఐ)తో పనిచేసే వాట్సాప్ చాట్‌బాట్‌ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుంది. 82476 23578 నెంబర్‌కు సందేహాలను వాట్సాప్ చేస్తే ఏఐ సమాధానం ఇస్తుంది. స్లాట్ బుకింగ్ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తీసుకువస్తున్న నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా ఇప్పటివరకు రెండు విడతల్లో 47 చోట్ల స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేశామన్న మంత్రి.. సోమవారం నుంచి మిగిలిన 97 కార్యాలయాల్లో కూడా అమలు చేస్తున్నామని తెలిపారు స్లాట్ బుకింగ్ విధానం అమలులో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురుకాకుండా చూడాలని స్పష్టం చేశారు. స్లాట్ బుకింగ్ విధానంపై 94 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. తొలి దశలో 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏప్రిల్ 10 నుంచి ఇప్పటివరకు 30,592 డాక్యుమెంట్లు, రెండో దశలో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మే 12 నుంచి ఇప్పటివరకు 14,099 డాక్యుమెంట్లు మొత్తం 45,191 రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. స్లాట్ బుకింగ్ వల్ల సాధారణం కంటే మూడు వేల డాక్యుమెంట్లు ఎక్కువగా రిజిస్ట్రేషన్ జరిగాయని ఆయన తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయింత్రం 5 గంటల వరకు(మధ్యాహ్న భోజన విరామ సమయం మినహాయించి) రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు స్లాట్ బుక్ చేసుకోవచ్చునని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ప్రతి కార్యాలయంలో రోజుకు 48 స్లాట్‌లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. స్లాట్ బుకింగ్ చేసుకోని వారి కోసం.. అత్యవసర సందర్భాల్లో సాయంత్రం 5 నుంచి 5.30 గంటల వరకు ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చామని తెలిపారు. ఇక, ఏఐ అనుసంధానంతో పని చేసే వాట్సాప్ చాట్‌బాట్‌ను అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ చేసుకునే వారు తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునని వివరించారు. రిజిస్ట్రార్ కార్యాలయం లొకేషన్, స్లాట్ బుకింగ్ ఖాళీలు, సమయం, గిఫ్ట్ డీడ్, సేల్ డీడ్‌పై వసూలు చేసే రుసుములు తదితర వివరాలపై ఏఐ చాట్‌బాట్ సమాచారం ఇస్తుందని తెలిపారు. అదే విధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఆధార్ ఈ-సంతకం విధానాన్ని ప్రవేశపెడుతున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. తొలుత ఈ విధానాన్ని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ఇక, అక్రమాలకు చెక్ పెట్టేలా లేఅవుట్‌ల్లో డబుల్ రిజిస్ట్రేషన్‌లు జరగకుండా ఉండేందుకు రిజిస్ట్రేషన్ పూర్తయిన, పూర్తి కాని ప్లాట్ల వివరాలు రిజిస్ట్రేషన్ కార్యాలయం, బిల్డర్, డెవలపర్ దగ్గర ఉండేలా త్వరలో రిజిస్ట్రేషన్ మాడ్యూల్‌ను తీసుకువస్తామని తెలిపారు. ఈ మాడ్యూల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తయిన ప్లాట్ల వివరాలు ఎర్ర రంగులో కనిపిస్తాయని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. కాగా, స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిభారం అధికంగా ఉన్న పటాన్‌చెరు, యాదగిరిగుట్ట, గండిపేట, ఇబ్రహీంపట్నం, సూర్యాపేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ సహా తొమ్మిది చోట్ల అదనపు సబ్ రిజిస్ట్రార్, సిబ్బందిని నియమించామని ఆయన వివరించారు.



కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

## జడ్పీహెచ్ఎస్ కంబాలపల్లిలో 1994-95 బ్యాచ్ 30వ వార్షికోత్సవ సమ్మేళనం





**మహబూబాబాద్ జూన్ 01, -నవభూమి:** జడ్పీహెచ్ఎస్ కంబాలపల్లి పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల 30వ వార్షికోత్సవ సందర్భంగా ఒక ఘనమైన సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులైన కె. నరసింహారెడ్డి, శ్రీ వై. రామనర్సయ్య, వై. నాగేందర్, పీఈటీ కొమరయ్య, ఆర్. శ్రీధర్ రెడ్డిలను పూర్వ విద్యార్థులు సత్కరించారు.ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు తమ గత అనుభవాలను, పాఠశాల రోజుల స్మృతులను గుర్తు చేసుకుని ఆనందించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, పాషా, శ్రీనివాస్ రెడ్డి, మాధవి, శ్రీదేవి, అనిత తదితరులు పాల్గొని వేడుకను స్మరణీయం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య జరిగిన ఆత్మీయ సంభాషణలు, గత జ్ఞాపకాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణను జోడించాయి.

## మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మాత నల్ల పోచమ్మకు బోనాలు

### పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**మెదక్ -నవభూమి:** అమ్మ దయతో అందరు సుఖసంతోషాలతో ఉండాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శ్రీ మాత నల్ల పోచమ్మ 19 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బోనాలు నిర్వహించారు. ఈ బోనాల కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లీ రోహిత్ రావు హాజరై ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనం ఎత్తుకొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు జిల్లా అధ్యక్షుడు బట్టి ఉదయ్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, ఉత్సవ కమిటీ బృందం తదితరులు పాల్గొన్నారు.



### అధికారుల తీరుతో

# అర్హులకు అన్యాయం

◆ అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందజేయాలి ◆ ప్రభుత్వ కార్యక్రమాలలో అధికార పార్టీ నాయకుల పెత్తనం

◆ అధికారపార్టీ తొత్తులుగా వ్యవహరిస్తున్న మండలఅధికారులు ◆ మాస్ లైన్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన

**ములకలపల్లి జూన్ 1 -నవభూమి:** అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు,రేషన్ కార్డులు అందజేయాలని సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించి,తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ నాయకురాలు కల్లూరి పద్మ అధ్యక్షత న అరుగ్యారెంటిల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సదస్సు ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గోకినేపల్లి ప్రభాకర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూపా భాస్కర్ లు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని అన్నారు ఇంత వరకు సక్రమంగా దానిని అమలు చేయలేదని,ప్రతి మహిళకు రెండు వేల ఐదువందల రూపాయలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి దగ్గర దగ్గర రెండు సంవత్సరాల కావస్తున్నా ఇంత వరకు దాని ఊసే లేదని అన్నారు.ఇందిరమ్మ ఇండ్లు ఎంపికలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, కొంత మంది చిన్నా చితకా నాయకులు చేతివాటం కూడా చూపిస్తున్నారని అన్నారు. గతంలో ఎన్నడు లేని విదంగా అధికారిక కార్యక్రమాలలో పార్టీ నాయకులు హడావుడి ఎక్కువగా కనిపిస్తుందని, న్యాయ బద్దంగా అధికారులు, గ్రామ స్థాయిలలో ఉన్నాటువంటి కమిటీలు అర్హులను ఎంపిక చేయడం మానేసి అధికారులు కూడా అధికార పార్టీ కార్యకర్తలా వ్యవహరింస్తూ, ప్రభుత్వ కార్యాలయాలను సైతం అధికార పార్టీ కార్యాలయాలుగా మార్చారు అన్నారు. అధికారిక కార్యక్రమాల్లో అర్హత లేకపోయినా అధికార పార్టీ నాయకులను స్టేజిల పైన కూర్చోబెట్టి కార్యక్రమాలు నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా మండలంలో అధికారులు వ్యవరిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజన రైతులను ప్రోత్సహిస్తే ప్రజా ప్రభుత్వం అని చెప్పే రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పోడు భూములను దున్నకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం జరుగుతుందన్నారు. ఇదేనా ప్రజా ప్రభుత్వం అంటే అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ పథకాలలో అధికార పార్టీ జోక్యం లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేసారు. అదేవిధంగా పోడు రైతులను ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.లేని యడల పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.అనంతరం స్థానిక తహశీల్దార్ గన్యా నాయక్ కు సమస్యల తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యులు పోతుగంటి లక్ష్మణ్, కల్లూరి కిషోర్, మండల నాయకులు నూపా సరోజని, నకిరకంటి నాగేశ్వరరావు, బండారు నాగేంద్రబాబు, పద్దం లక్ష్మణరావు, ఓరుగంటి శ్రీను, శాస్త్రబోయిన వెంకటేశ్వరరావు మరియు కారం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.







# ప్రభుత్వం రైతాంగానికి అండ

**ఖమ్మం-నవభూమి:** చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఈ ఏడాది ధాన్యం పండించారని, 65 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతాంగం పండించారని, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా లో డిప్యూటీ సీఎంతోపాటు ఇన్చార్జ్ మంత్రులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలబడిందని, ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతాంగానికి వారం రోజుల్లలో వారి ఎకౌంట్లలో డబ్బులు వేస్తామని భట్టి విక్రమార్క చెప్పారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ విజయమని, రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు అందరికీ ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నానని భట్టి విక్రమార్క అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళు ..దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నామని, ప్రతి నియోజకవర్గానికి ఒకేసారి 3,500 కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నిరంతరం ఇళ్ల మంజూరు ప్రక్రియ జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో పేదలతో ఆడుకున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో నాలుగు లక్షల 50 వేల ఇళు మంజూరు చేసి పేదలకు అందజేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి మాత్రమే ఇళ్లు మంజూరు చేయాలన్నారు. చిన్న పొరపాటు కూడా జరగడానికి వీల్లేదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్: లంకా దినకర్ ఇదో మహోత్తర కార్యక్రమం..ఇదోక మహోత్తర కార్యక్రమం అని, ఇంత గొప్ప కార్యక్రమానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పేదలందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. రాష్ట్రంలో రైతన్నకు విత్తనాలు అందజేసే విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, నకిలీ విత్తనాల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో రైతాంగానికి, ప్రజలకు హామీ ఇచ్చామని, గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణిని రద్దు చేస్తామని స్పష్టంగా చెప్పామన్నారు. చెప్పినట్టుగానే అధికారంలోకి రాగానే ధరణిని రద్దుచేసి ఆనాదిగా వస్తున్న దుర్మార్గపు చట్టాలను తొలగించి సరికొత్త భూ భారతి చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చామన్నారు. జూన్ 2న ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని చెప్పారు. పెద్ద ఎత్తున సంబరాలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.ఇది ప్రజా ప్రభుత్వం.. మంత్రి పొంగులేటి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఇన్చార్జి మంత్రులతో కలిసిసమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాం

## నల్ల పోచమ్మ తల్లి దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి



**మెదక్ -నవభూమి:** శ్రీ మాత నల్ల పోచమ్మ దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి అన్నారు.మెదక్ జిల్లా కేంద్రంలో ఆదివారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నల్ల పోచమ్మ బోనాల ఉత్సవాల కార్యక్రమంలో మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలునిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్ల పోచమ్మ తల్లి దయతో వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంట పండి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలనిఅమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం మున్నూరు కాపు సంఘం ఉత్సవ సభ్యులు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ లు మల్లికార్జున గౌడ్, బట్టి. జగపతి, పట్టణ పార్టీ కో కొన్వీనర్ గడ్డమీది. కృష్ణ గౌడ్, నాయకులు బట్టి. ఉదయ్, అశోక్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందరివాడు

### నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసిపి1: శంకర్ రాజు

**కంటోన్మెంట్, నవభూమి ప్రతినిధి, జూన్ 1:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందరివాడని హైదరాబాద్ నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసిపి 1. శంకర్ రాజు తెలిపారు . ఆదివారం లోతుకుంటలో అంబేద్కర్ విగ్రహానికి 117 వ వారం జ్ఞానమాల కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణంలో ప్రజా పరిపాలన, ఎగ్జిక్యూటివ్ నిర్వహణ, న్యాయవ్యవస్థ సమాన పరిపాలన హక్కులు కల్పించాలని ప్రతి అంశం రాజ్యాంగంతో ముడిపడి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు . లోతుకుంట అంబేద్కర్ విగ్రహం వద్ద విస్తరణలో భాగంగా ప్రమాదాలు జరగకుండా అంబేద్కర్ విగ్రహం చుట్టు ప్రహరీ గోడను కంటోన్మెంట్ అధికారుల చేత నిర్మిస్తున్నామని చెప్పారు.

### భూధార్ ఉంటేనే

# కేంద్ర పథకాల వర్తింపు

**పెద్దపల్లి-నవభూమి:** భూధార్ కార్డు ఉంటేనే వ్యవసాయ పరంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వర్తించను న్నాయి. ఆ మేరకు తప్పనిసరిగా భూధార్ గుర్తింపు కార్డు పొందాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు రైతు వేదికలు, గ్రామాలకు వెళ్లి భూముల వివరాలను నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 25 శాతం వరకు నమోదు ప్రక్రియ ముగిసిందని చెబుతున్నారు. ఆధార్కార్డు మాదిరిగా సొంత భూము లు కలిగిన రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం భూధార్ సంఖ్యను కేటాయిస్తుంది. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు చేపట్టింది. భూమి హక్కులను ధ్రువీకరించేందుకు ఆధీకృత రికార్డులు కలిగిన రైతు లకు మాత్రమే ఈ విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాయితీలు, బ్యాంక్ రుణాలు వంటి సౌకర్యాలకు భూధార్ తప్పని సరి అని కేంద్రం స్పష్టం చేసింది. ఆ మేరకు జిల్లాలో ఈ నెల 5వ తేదీ నుంచి రైతువేదికల్లో ఆన్లైన్లో భూముల వివరాలను నమోదు చేయడంతో పాటు గ్రామాలకు వెళ్లి కూడా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వివరాలు నమోదు చేస్తున్నారు. 25 శాతం భూముల వివరాలు నమోదు..జిల్లాలో సుమారు 2 లక్షల 90 వేల ఎకరాల సాగు భూములు ఉండగా, ఆ భూములను 1,61,743 మంది రైతులు పట్టాలు కలిగి ఉన్నారు. ఇప్పటి వరకు భూధార్ కోసం 40 వేల మంది రైతుల భూముల వివరాలను నమోదు చేశారు. వచ్చే నెల 5వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికీ, పొడిగించే అవకాశాలు లేకపోలేదని వ్యవసాయ శాఖాధికారులు పేర్కొంటు న్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక పోర్టల్ను రూపొం దించింది. దానికి సంబంధించిన యాప్ను ఏఈవోలు మొబైల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని లాగిన్ అవుతున్నారు. పట్టా భూములు కలిగిన రైతుల



ఆధార్ నంబర్ నమోదు చేయగానే, అప్పటికే ఆ పోర్టల్లో సంబంధిత రైతుల భూముల వివరాలు వస్తుం టాయి. రైతులు తీసుకవచ్చిన పట్టాదారు పాసు పుస్త కాల్లో ఉన్న వివరాలను సరి చూసుకుని నమోదు చేస్తున్నారు. మొదట ఒక తాత్కాలిక రిజిస్ట్రీ నంబర్తో రైతుల భూముల వివరాలను నమోదు చేస్తున్నారు. ఆ తర్వాత 11 అంకెలు గల భూధార్ నంబర్ను కేటా యించనున్నారు. అయితే కేవలం నంబర్ మాత్రమే కేటాయిస్తారా, కార్డు జారీ చేస్తారా అనే విషయమై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. డిజిటల్ అగ్రిమి షన్ కార్యక్రమంలో భాగంగా రైతులందరికి విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేయాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది.ముమ్మరంగా భూముల వివరాలు నమోదు..వ్యవసాయశాఖ రైతువేదికలతో పాటు ఏఈవోలు ముందస్తుగా రైతులకు సమాచారం ఇచ్చి గ్రామాలకు వెళ్లి కూడా భూధార్ కోసం వివరాలను ముమ్మరంగా నమోదు చేస్తున్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలను నిక్షిప్తం చేస్తున్నారు. రైతులు వ్యవసాయ శాఖ ఏఈ వోల వద్దకు ఆధార్ కార్డు. పట్టాదారు పాసుబుక్, అడంగల్ పహాణి, ఆధార్ లింక్ అయిన మొబైల్ ఫోన్ తీసుకెళ్లాలి. భూభారతి పోర్టల్, రికార్డ్స్ ఆఫ్ రైట్స్, పట్టాదారు పాస్ పుస్తకాల ఆధారంగా రైతుల యాజ మాన్య హక్కులను నిర్ధారించి వివరాలను నమోదు చేస్తారు. ఆ తర్వాత 11 అంకెల విశిష్ట సంఖ్యను కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుంది. భూధార్ ఐడీ నంబర్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం కిసాన్ యోజన, బీమా, ఈజీఎస్ పనులు, మొక్కల పెంపకం మంజూరు చేయనున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన రైతు భరోసా, రుణమాఫీ, తదితర పథకా లకు ఫార్మర్ రిజిస్ట్రీకి ఏ రకమైన సంబంధం లేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి దోమ ఆదిరెడ్డి తెలి పారు. జిల్లాలో రెవెన్యూ రికార్డుల్లో మ్యాపింగ్ కాని భూములు, రెండు పాస్ పుస్తకాలు కలిగిన రైతులు, ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులకు భూధార్ ఐడీ నంబర్ కేటాయింపు ప్రక్రియను నమోదు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. పట్టాలు కలిగిన రైతులు ఏఈవోల వద్ద భూముల వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.జిల్లాలో కౌలు రైతులతోపాటు అసైన్డ్, దేవాదాయ భూములు, అటవీ భూములు సాగు చేసుకునే చాలామంది రైతులకు నేరుగా యాజమాన్య హక్కులు లేవని, వీరం దరికీ కూడా కేంద్ర పథకాలు వర్తించే విధంగా భూధార్ కార్డులను ఇవ్వాలని రైతు సంఘాల నాయ కులు కోరుతున్నారు.

# యువతకు 'ఆర్థిక' వికాసం

**సిరిసిల-నవభూమి:** రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుపేద, మధ్య తరగతి యువతకు ఉపాధి కల్పించేందుకు రూ. 50 వేల నుంచి 4 లక్షల రూపాయల వరకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. యువత నుంచి దరఖాస్తులు అహ్వానించి లబ్ధిదారుల ఎంపిక పక్రియ చేపట్టింది. రాజీవ్ యువ వికాసంతో ఉపాధిపై అశలు పెట్టుకున్న నిరుద్యోగులకు సిబిల్ స్కోర్ అడ్డుగా మారింది. డిప్యూటీ సీఎం రాజీవ్ యువ వికాసానిని సిబిల్ స్కోర్ అవసరం లేదని ప్రకటనలు చేసినా ప్రభుత్వ మార్గదర్శకాలు బ్యాంకర్లకు చేరకపోవడంతో సిబిల్ స్కోర్ చిక్కుముడి అలాగే ఉండిపోయింది. బ్యాంక ర్లు ఎటువంటి రుణాలు ఇవ్వాలన్న మొదట సిబిల్ స్కోర్ను ప్రామాణికంగా తీసుకుంటారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు బ్యాంక్లకు వెళ్లిన తరువాత సిబిల్ స్కోర్ యువతకు నిరాశ మిగిలి స్తుంది. అధార్, సెల్ నెంబర్లు జత చేయడంతో రుణాల పక్రియ కొంత అయోమయంగానే మారిం ది. అర్హులైన వారికి ఆర్థిక వికాసంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందించడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. వచ్చిన దరఖాస్తులను 1:2 నిష్పత్తిలో పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. రాజీవ్ యువ వికాసంలో తొలి విడతగా దరఖాస్తుల స్వీకరణ పరిశీలన పూర్త యిన వాటిలో జూన్ 2 తెలంగాణ అవిర్భావ దినో త్సవం రోజు లబ్ధిదారులకు అందించే విధంగా కసరత్తు మొదలు పెట్టారు.జిల్లాలో 7,680 యూనిట్లు... 7,121 మంది అర్హులుజిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకానికి 36,819 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఎస్సీ కార్పొరేషన్కు 8,865 దరఖాస్తులు, ఎస్టీ కార్పొరేషన్కు 1943, బీసీ కార్పొరేషన్కు 23,243 మైనార్టీ కార్పొరేషన్కు 1,606, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్కు 39, ఈబీసీ దరఖాస్తులు 1123 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో పరిశీలిం చారు. జిల్లాలో 7,680 యూనిట్లకు రుణాల పంపిణీ లక్ష్యం కాగా 7121 మంది అర్హులను ఎంపిక చేశా రు. రూ.50 వేల వరకు 2464 యూనిట్లకు 2148 మంది అర్హులుగా గుర్తించారు. రూ 50 వేల నుంచి లక్ష వరకు 1876 యూనిట్లకు 1771 మంది అర్హు లు, రూ లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 1642 యూనిట్లకు 1587 మంది అర్హులుగా రూ. 2 నుంచి రూ. 3 లక్షల వరకు 372 యూనిట్లుకు 372 మంది అర్హులు, రూ. 2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు 941 యూనిట్లకు 924 మంది అర్హులు, రూ. 3 లక్ష లనుంచి రూ. 4 లక్షల వరకు 308 యూనిట్లకు గాను 308 మంది అర్హులు 43 బోర్వెల్ యూ నిట్లకు 8 మంది అర్హులు. ఎనర్జీ ఓఆర్సీ 32 యూ నిట్లకు ఇద్దరు అర్హులు, సోలార్ ప్యానెల్ ఫర్ బోర్వెల్కు 2 యూనిట్లకు ఒక్కరు అర్హులుగా గుర్తించారు.యువతకు ఆర్థిక చేయూత రాజీవ్ యువ వికాసంతో యువతకు ఆర్థిక చేయూత లభించనుంది. ప్రభుత్వం జనాభా ప్రతిపాదికన కులాల వారీగా రాజీవ్ యువ వికాసానికి యూనిట్లను ప్రభుత్వం కేటా యించింది. ఈ యూనిట్లు ఎవరికి అందుతాయనే అసక్తి నెలకొంది. పథకంలో రూ. 50 వేలు, రూ లక్ష, రూ 2 లక్షల నుంచి రూ 4 లక్షల రుణాలు అం దిస్తుండగా రూ. 50 వేల వరకు వంద శాతం సబ్సిడీ రాయితీ, రూ 50 నుంచి రూ లక్ష వరకు 90 శాతం సబ్సిడీ రాయితీ కాగా పది శాతం లబ్ధిదా రుడు చెల్లించాల్సి ఉంటుంది. రూ. లక్ష నుంచి రూ 2 లక్షల వరకు 80 శాతం రాయితీ, 20 శాతం రుణం, రూ. 2 నుంచి 4 లక్షల వరకు 70 శాతం సబ్సిడీ 30 శాతం రుణంగా అందించనున్నారు. ప్రభుత్వం అందించే యూనిట్లలో పౌల్ట్రీ, బ్యాగుల తయారీ, కొబ్బరిబొండాల దుకాణాలు, బ్యాంగిల్ స్టోర్, డెయిరీ ఫాం, ఎలక్ట్రికల్, మినీ సూపర్ బజా ర్, స్పింకర్లు, డ్రిప్ ఇరిగేషన్, గొర్రెలు, సెలూన్, బ్యూటీ పార్లర్, హార్డ్వేర్, మెడికల్ దుకాణాలు ఇల పలు యూనిట్లను నిర్ణయించారు.



## ఘనంగా వేముల వీరేశం పుట్టినరోజు వేడుకలు



**నల్లగొండ,-నవభూమి:** నకిరేకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే వేముల వీరేశం పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వీరేశం జన్మదినోత్సవాన్ని సంబరంగా చేసుకున్నారు. వీరేశం అనుచరులు, అభిమానులు ఆయన పుట్టిన రోజు సందర్భంగా కేకులు కట్ చేసి, బాణాసంచా కాల్చారు. పలువురు రక్తదానం చేశారు. మరికొందరు అనాథ పిల్లలకు పండ్లు, అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు. ఏపీ లింగోటం గ్రామంలో ఎమ్మెల్యే వీరేశం ప్రధాన అనుచరుడైన గడ్డం పశుపతి ఆధ్వర్యంలో బర్త్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఊరంతా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి.. వీరేశానికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ ప్రజలందరి సమక్షంలో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన పశుపతి.. ప్రజల నాయకుడైన ఎమ్మెల్యే వీరేశానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండే నాయకుడు వీరేశం అని.. ఆయన మరో వంద సంవత్సరాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.సీఎంను కలిసిన వేముల వీరేశం..తన పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసానికి వచ్చిన వీరేశం.. సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకు ముందు.. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వీరేశానికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఒక ప్రకటన విడుద చేశారు.

## దళిత విద్యార్థులను అవమాన పరిచిన గురుకుల కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

### డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

**కంటోన్మెంట్, -నవభూమి:** దళిత విద్యార్థులు పాష్ సొసైటి నుండి రాలేదని వాళ్ళ బాత్ రూమ్ లు,రూమ్ లను పిల్లలే క్లినింగ్ చెసుకొవాలని అవమానపరిచి తన అగ్రకుల స్వభావాన్ని చాటిన గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణిని తక్షణమే సస్పెండ్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు.ఆదివారంనాడు అయన దుబ్బాక లో మాట్లాడుతూ ఇటివల ప్రిన్సిపాల్ ల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులను కులం పేరుతో అవమానపర్చడమే కాకుండా బానిసల కంటే హినంగా అవమానపర్చడం తగదన్నారు.తన క్లినింగ్ ఆదేశాలను ప్రశ్నించే తల్లిదండ్రులు, పిల్లలు పై చర్యలు తీసుకొవాలని హూకుం జారిచేయడం సిగ్గు చేటన్నారు. ముందుగా తన కార్యాలయంలో తన బాత్ రూమ్ లను క్లిన్ చెసుకొని ఆదర్శంగా నిలవాలన్నారు.తన వాఖ్యాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఇప్పటికె గురుకుల బోధనలో, అహరం లో నాణ్యత కరువైనదన్నారు. దళిత విద్యార్థులను అవమాన పరిచిన కార్యదర్శి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలన్నారు.విద్యార్థులు లేరనే సాకుతో 12 గురుకుల కళశాలలను మూసి వేయడాన్ని ఉపసంహరించు కొవాలన్నారు.ఈ కార్యక్రమం లో డిబిఎఫ్ రాష్ట్ర నాయకులు దుబాషి సంజీవ్, స్వామి,సిద్దిపేట జిల్లా డిబిఎఫ్ ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

**కరీంనగర్-నవభూమి:** యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. జిల్లావ్యాప్తంగా వరిధాన్యం కొనుగోలు కోసం ఏర్పాటు చేసిన 325 కేంద్రాలను మూసేశారు. ఈ సీజన్‌లో 51,965 మంది రైతుల నుంచి 716.12 కోట్ల రూపాయల విలువ చేసే 3,08,683 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటికే 50,441 మంది రైతుల ఖాతాల్లో 695.07 కోట్ల రూపాయలు జమ చేశారు. మరో 1,524 మంది రైతులకు 21.5 కోట్ల రూపాయలను చెల్లించాల్సి ఉంది. ఒకటి, రెండు రోజుల్లో ఈ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ అవుతుందని అధికారులు తెలిపారు. జిల్లాలో ఈ సీజన్‌లో 2,66,896 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ విస్తీర్ణం నుంచి 5,86,723 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు.మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని అంచనా వేసిన జిల్లా యంత్రాంగం జిల్లావ్యాప్తంగా 325 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. 45 రోజులపాటు అన్ని గ్రామాల్లో ధాన్యం సేకరణ నిర్వహించి 3,08,683 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 2,75,989 మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 32,694 మెట్రిక్ టన్నులు సన్నరకం ధాన్యం ఉన్నాయి.జిల్లావ్యాప్తంగా 182 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేసిన



కొనుగోలు కేంద్రాల ద్వారా 439.74 కోట్ల విలువ చేసే 1,89,551 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.101 ఐకేపీ కేంద్రాల ద్వారా 165.07 కోట్ల విలువచేసే 71,151 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నారు.38 డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల ద్వారా 98.72 కోట్ల విలువచేసే 42,551 మెట్రిక్ టన్నుల ధాన్యం, నాలుగు హాకా కేంద్రాల ద్వారా 12.59 కోట్ల రూపాయల విలువచేసే 5,428 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.ప్రథమ స్థానంలో సహకార సంఘాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు క్రియాశీలక పాత్ర వహించి ఎక్కువ కొనుగోళ్లు చేశాయి. ఐకేపీ మహిళా కేంద్రాలు ద్వితీయ స్థానంలో నిలిచాయి. నైరుతి రుతుపవనాలు ఈసారి 15 రోజులు ముందస్తుగానే రోహిణి కార్తెలోనే వచ్చినా జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తవడంతో ఎలాంటి ఇబ్బంది ఎదురవ్వలేదు. చివరి రెండు, మూడు రోజుల్లో ఉపరితల ద్రోణి కారణంగా అకాల వర్షాలు కురిసి కొద్దిపాటి ధాన్యం తడిసినా వాటిని కొనుగోలు చేశారు. దీంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండానే వరిధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి.

# సాగు భారం..

**జగిత్యాల,-నవభూమి:** అన్నదాతలకు ప్రతి యేటా పెట్టుబడి భారంగా మారుతోంది. ప్రస్తుత సీజన్‌లో ఎరువుల ధరలు అమాంతం పెరిగి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. డీఏపీ, పొటాష్ తదితర ఎరువుల ధరలు పెరిగాయి. దీనికి తోడు ట్రాక్టర్లు, యంత్రాల అద్దెలు, వ్యవసాయ కూలీల కూలి అదనపు భారంగా తయారైంది. గత యేడాది కంటే ఈసారి ఎకరాకు రూ.5 వేల వరకు అదనపు భారం పడనుందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో అత్యధికంగా రైతులు కాలువలు, చెరువులు, కుంటలు, బోరు బావులు, వర్షాలపై ఆధారపడి వరి సాగు చేస్తుంటారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతాల్లో అత్యధికంగా వరి సాగు చేస్తుండగా, మిగిలిన ప్రాంతాల్లో మొక్కజొన్న, పత్తి, చెరుకు, పసుపు, కంది, పెసర తదితర పంటలపై రైతులు దృష్టి సారించారు.జిల్లాలో వానాకాలం సాగు అంచనా..జిల్లావ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం కంటే అధికంగా వానాకాలంలో పంటల సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 3,35,978 ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 4,14,419 ఎకరాలు సాగు చేస్తారని అంచనా. ఇది సాధారణం కన్నా 78,441 ఎకరాలు అధికంగా ఉంది. ఇందులో ప్రధానంగా వరి 3,10,642 ఎకరాలు, మొక్కజొన్న 32,000 ఎకరాలు, కందులు 1,500, పెసర్లు 100, సోయా చిక్కుడు 500, పత్తి 18,000, చెరుకు 500 ఎకరాలు, పసుపు 8,500, మిరప 500 ఎకరాలు, పలు కూరగాయల పంటలు 400 ఎకరాలు, ఆయిల్ ఫాం 3,000 ఎకరాలు, మామిడి 38,277 ఎకరాలు, ఇతర పంటలు 500 ఎకరాల్లో సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. 2023 వానాకాలం సీజన్‌లో జిల్లాలో 4,17,378 ఎకరాల్లో, 2024 వానాకాలం సీజన్‌లో 4,13,974 ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేశారు.కూలీల కొరత..పసుపు, పత్తి సాగుకు గ్రామాల్లో వ్యవసాయ కూలీల కొరత ఏర్పడడంతో ఇతర ప్రాంతాల నుంచి రప్పిస్తున్నారు. దీంతో అధిక కూలితో పాటు రవాణా ఖర్చులు సైతం భరించాల్సి వస్తోంది. దీనికి తోడు ఇందనం ధరలు పెరుగుతుండడంతో యత్రాల అద్దెలు పెంచడం వల్ల రైతులపై భారం పడుతోంది. గత యేడాది వానాకాలంలో పొలం దున్నేందుకు ట్రాక్టర్ అద్దె గంటకు రూ.1,200 ఉండగా ఈసారి రూ.1,500కు పెంచారు. గత యేడాది మగ కూలీలకు రూ.800 వరకు ఉండగా ప్రస్తుతం రూ.900, ఆడ కూలీకు రూ.400 వరకు ఉంటుంది. గత యేడాది పత్తి సాగుకు ఎకరాకు సుమారు రూ.30 వరకు పెట్టుబడి కాగా, ఈ యేడాది రూ.40 వేల నుంచి రూ. 50 వేల వరకు పెరిగే అవకాశం ఉందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.డీఏపీ రూ.1,450కి పెంపు గత యేడాదితో పోలిస్తే ప్రస్తుతం ఎరువుల ధరలు పెరిగాయి. డీఏపీ రూ.1,300 నుంచి 1,450 వరకు పెరిగింది. అదేవిదంగా 20-20-0-15 ఎరువు రూ.1,150 నుంచి రూ. 1,250కు, 28-28-0 ఎరువు రూ.1,275 నుంచి రూ.1,400కు, పొటాష్ రూ.850 నుంచి రూ.1,200కు పెరిగాయి. జనుము రూ.1,148 నుంచి రూ.2,500, జీలుగ రూ.1,116 నుంచి రూ.2,138 వరకు ధరలు పెరిగాయి.గిట్టుబాటు కావడం లేదు నోముల రాజేశ్వర్‌రెడ్డి, రైతు, లక్ష్మీదేవిపల్లి రోజురోజుకూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో సాగు భారంగా మారుతోంది. కనీసం పెట్టుబడి అయినా చేతికందితే చాలన్న పరిస్థితిలో పంటలు సాగు చేస్తున్నాం. ప్రకృతి అనుకూలిస్తేనే పంట చేతికొచ్చే అవకాశం ఉంది. లేదంటే అప్పులే మిగులుతాయి.ఖర్చులు పెరుగుతున్నాయి ఈర్ల శంకరయ్య, రైతు, బుగ్గారం ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఖర్చులతో పెట్టుబడి భారంగా మారుతోంది. ప్రభుత్వమే ప్రోత్సాహం అందించాలి. రైతులకు సాగు భారం కాకుండా సర్కారు చర్యలు తీసుకోవాలి. ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ కూలీల ఖర్చు, ఇంధనం ధరలు పెరుగుతున్నాయి. దీంతో వ్యవసాయ పెట్టుబడులు సైతం పెరుగుతున్నాయి.

